క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన పసుపుల మీనా కుమారుడు సిద్ధు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈవిషయం తెలియడంతో పట్టణంలోని శ్రీ రాంనగర్ కాలనీకి చెందిన అల్లాడి శోభ–వేణు దంపతులు వైద్యఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు.

బాధిత కుటుంబానికి సాయం


సాయం అందిస్తున్న మోహన్‌రావుపటేల్

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామంలో చంద్రబాయి అనే వృద్ధురాలు ఇటీవల మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని శనివారం మోహన్‌రావుపటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావుపటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు. సుభాష్‌పటేల్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా పల్లకిసేవ


పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవరకోట ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం గోవిందా నామస్మరణంతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

సారంగాపూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లో రిజిస్టర్ చేసిన కేసుల వివరాలు, పరిష్కరించిన కేసుల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు, గడిచిన ఎన్నికల్లో అల్లర్లు, గొడవలు జరిగిన పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏయే గ్రామాల్లో భద్రతా అంశాలు అవసరమో సిబ్బంది అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం


సీటు పొందిన వారితో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: గురుకులాల్లో సీట్లు సాధించిన తిర్పెల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష రాయగా ఎనిమిది మంది సీట్లు పొందారు. దీంతో శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించి అభినందించారు. హెచ్‌ఎం కరుణకుమారి, తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి ఇద్దరు వీవీలను ఏర్పాటు చేయడంతోనే విద్యార్థులు సీట్లు సాధించారని గ్రామస్తులు తెలిపారు. సుంచు కృషివర్ధన్, బొమ్మెన మణితేజ, వేముల గణదీప, పల్లెపు ప్రదీప్, వేముల రిత్విక్, విజయ్‌కుమార్, శ్రావ్య, విజ్ఞేశ్ సీట్లు పొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ కుమారి, సీఆర్పీ మహేందర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వర్షం

ఖానాపూర్: మండలంలోని కొత్తపేట్, బావాపూర్(కే), గోసంపల్లె, గొడలపంపు గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ పలువురి ధాన్యం తడిసిపోయింది.

విత్తే కాలం.. జర పైలం

- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి
- అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి
- నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు
- భైంసా ఏవో రాంచందర్‌నాయక్

భైంసా ఏడీఏ పరిధిలోని మండలాలు	: భైంసా, కుంటాల, కుభీర్
మొత్తం పత్తి సాగువిస్తీర్ణం(అంచనా)	: దాదాపు 55వేల ఎకరాలు
అవసరమైన పత్తి విత్తనాలు	: 1.10 లక్షల ప్యాకెట్లు
మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవి	: 1.40 లక్షల ప్యాకెట్లు

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు..
ఏవో, భైంసా : 72888 94043
ఏవో, కుభీర్ : 72888 94044
ఏవో, కుంటాల : 72888 94045


భైంసాలోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వీణ


రాంచందర్, ఏవో

భైంసాటౌన్: వానాకాలం పంటల సాగుకు రైతులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ముధోల్ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా పత్తి, సోయా పంటలు పండిస్తారు. ఈసారి అధికంగా పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. భైంసా ఏడీఏ పరిధిలో భైంసా, కుభీర్, కుంటాల మండలాలు ఉండగా.. వీటి పరిధిలో దాదాపు 55వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షాలు కురువగానే రైతులు విత్తుకునేందుకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. పత్తి రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భైంసా ఏవో రాంచందర్ నాయక్ పలు సూచనలు చేశారు.

నకిలీ విత్తనాల బెడద..

రైతులు నాణ్యమైన విత్తనం ఎంచుకొని సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది. విత్తింది నకిలీ విత్తనమైతే దిగుబడి రాక పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తూ నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. విత్తన విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఆయా డీలర్ల వారీగా స్టాక్ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా.. డిమాండ్ పేరిట అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా తమకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- పత్తి సాగు చేసే రైతులు డిమాండ్ ఉన్న రకాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో అధిక వర్షాల నేపథ్యంలో ఈసారి డిమాండ్ ఉన్న రకాల విత్తనాలకు కొరత ఉంది. రైతులు ఒకేరకం కాకుండా పలు రకాల విత్తనాలు విత్తుకోవడం వల్ల నష్టపోకుండా ఉండవచ్చు.
- బోల్‌గార్డ్–2 విత్తన ప్యాకెట్ ధర రూ.864 మాత్రమే. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి.
- ఇతర జిల్లా, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి గ్రామాల్లో కొందరు బీటీ–3 విత్తనాల పేరిట లూజ్ విత్తనాలు, నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశముంది. లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దు. విత్తన ప్యాకెట్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, జీఈఏసీ(జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ) నంబర్ తప్పనిసరిగా చూసుకోవాలి.
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్‌పై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్, లాట్ నంబర్, ధర ఉండాలి. విత్తుకున్న తరువాత పంట దిగుబడి వచ్చేవరకు బిల్లుతోపాటు ఖాళీ ప్యాకెట్లను రైతులు తమ వద్ద భద్రపర్చుకోవాలి.
- భైంసా ఏడీఏ పరిధిలోని భైంసా, కుంటాల, కుభీర్ మండలాల్లో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

విత్తన దుకాణాల్లో తనిఖీలు


భైంసాలో పరిశీలిస్తున్న అధికారులు


రేవోజీపేటలో తనిఖీ చేస్తున్న ఏడీఏ సుజాత

భైంసాటౌన్: పట్టణంలోని గాంధీగంజ్‌లో విత్తన దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఏడీఏ వీణ, ఏవో రాంచందర్‌నాయక్‌తోపాటు పోలీసు అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు కొనే సమయంలో రశీదు పొందడంతోపాటు బిల్లుపై లాట్ నంబర్ సరిచూసుకోవాలని రైతులకు సూచించారు.

దస్తురాబాద్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే.. ఫర్టిలైజర్ దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని ఏడీఏ సుజాత హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఎరువులు, విత్తనాల దుకాణ యజమానులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అంతకుముందు రేవోజీపేటలో ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని చింతకుంటలో శనివారం ఏఈవో శ్రీనివాస్ విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకొని పంట చేతికొచ్చే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. రశీదుపై విత్తన లాట్ నెంబర్, గడువు కాలం సరిచూసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాజేందర్, జాదవ్ బాబురావు, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన


సుభాశ్‌నగర్‌లో సరుకులు ఇస్తున్న సీడీపీవో


దస్తురాబాద్‌లో సీమంతం చేస్తున్న మహిళలు


కుభీర్‌లో అవగాహన కల్పిస్తున్న టీచర్


ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్, సుభాశ్‌నగర్ తదితర కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారుల హాజరు వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం పలువురికి పోషకాహార సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్ సరోజ, సిబ్బంది ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిత్రకళ మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని పౌష్టికాహారం, కోడిగుడ్లు, మొలకెత్తే విత్తనాలు, పండ్లు తీసుకోవాలన్నారు. ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రత్నమాల, భారత, రాజవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సత్యశీల మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారుల పేర్లను అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించాలన్నారు. బాలింతలు ఆరు నెలల వరకు తల్లిపాలే బిడ్డలకు ఇవ్వాలని సూచించారు. అనంతరం బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కిశోర బాలికలు, ఆశకార్యకర్త గిరిజ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్


ఓలాలో తేమ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావ్

కుంటాల: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో కుంటాల మండలంలోని ఓలాలో తడిసిన ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. రైతులకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈదురుగాలులతో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కల్లూర్, ఓలా, లింబా(కె), కుంటాల గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన మార్తాండరావు, గజ్జన్‌రావు, గంగవ్వ, కళావతి, గణేశ్ కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఎంపీటీసీ కట్ట రవి, మాజీ ఎంపీపీ అరుణ రమణారావు, పిప్పెర వెంగళరావు, జక్కుల గజేందర్, మునీశ్వర్ రాజు, భోగ గోవర్ధన్, సాయికుమార్, సోఫీ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపట్టాలి

ఖానాపూర్: విద్యార్థులకు సులువుగా ఉండేలా ప్రభుత్వం ఇంటర్ ప్రవేశాల ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేపట్టాలని విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు లోబడి ప్రవేశాలు చేయాలని కోరారు. కార్పొరేట్ పేరిట విద్యను వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి


పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్

తానూరు: అమ్మ ఆదర్శపాఠశాలల్లో పనులు సత్వరం పూర్తి చేయాలని ఎంపీడీవో మోహన్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దాగాం, సింగన్‌గాం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో మరమ్మతులను పరిశీలించారు. బడులు ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. దాగాంలో నర్సరీ, ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శి తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపుతోపాటు ఇతర మరమ్మతుల నేపథ్యంలో పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌రావు తెలిపారు. పట్టణంతోపాటు సోమార్పేట్, సత్తనపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్‌ఎస్‌ఎస్ నగర సాంఘిక్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ మైదానంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ సాంఘిక్ ఉంటుందని నగర సంఘచాలక్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి స్వయం సేవకులు హాజరుకావాలని కోరారు.

ధాన్యం తరలింపులో అలసత్వం వద్దు

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

సాక్షి స్పందన


కుంటాలలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

కుంటాల: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించడంలో సిబ్బంది అలసత్వం వహించొద్దని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని పంట కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 24న సాక్షిలో ‘కొనుగోళ్లలో జాప్యం’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ శనివారం మండలంలోని అంబకంటి, కుంటాల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. లారీల కొరత లేదని, గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనల మేరకు తేమశాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్వయంగా తేమశాతం పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని సకాలంలో పంట ఉత్పత్తులు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట డీటీ నరేశ్ గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హన్మాండ్లు, ఆర్‌ఐ అడెల్లు, సీఈవో నాగభూషణం, సిబ్బంది మహేశ్, కృష్ణ ఉన్నారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి


ఖానాపూర్: ఎర్వచింతల్‌లో వైకుంఠధామం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

ఖానాపూర్: రాబోయే వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్మల్ డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల్లో శనివారం డీఎల్‌పీవో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్‌షెడ్లు, క్రీడాప్రాంగణాలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు ఎంపీడీవో సునీత ఆయా గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

దస్తురాబాద్: గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని డీఎల్‌పీవో రమేశ్ సూచించారు. శనివారం మండలంలోని భూత్కూర్ గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని డ్రైయినేజీల్లో పూడిక తీయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతివనం, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి అనిల్, పారిశుధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

జీలుగ సాగుతో లాభాలెన్నో..


జీలుగ (ఫైల్)

లక్ష్మణచాంద: రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఆయా పంటల సాగుకు ముందు జీలుగ సాగు చేస్తే నేలలో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్ రైతులకు సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రయోజనాలివీ..

- సాగు చేసిన జీలుగ మొక్కలను కలియదున్నడం ద్వారా నేల భౌతిక, రసాయన, జీవలక్షణాలు వృద్ధి చెందుతాయి. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- తక్కువ ఖర్చుతో నేలకు సేంద్రియ పదార్థం ఎక్కువ మోతాదులో అందించే వీలు కలుగుతుంది. నేలలో పోషకాలను నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది.
- నేల గుల్లబారడంతోపాటు గాలి ప్రసారం పెరిగి నీటి వ్యవస్థ మెరుగుపడుతుంది. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- సేంద్రియ పదార్థం నేలకు అందడం వలన నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది.. అనేక జీవ రసాయన చర్యలు జరుగుతాయి. లభ్యం కాని స్థితిలో ఉన్న పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి.
- జీలుగ..లెగ్యూమ్ జాతి మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ మూలకాలను పంటకు చేకూరుస్తాయి.
- మొక్కలకు అదనంగా రెండు శాతం నత్రజని, సూపర్‌ఫాస్ఫేట్‌ను అందిస్తాయి. దీంతో పంటలకు అన్ని రకాల పోషకాలు అంది అధిక దిగుబడులు వస్తాయని ఏవో పేర్కొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

కుంటాల: మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డులో బోరు బావిలో నీరు అడుగంటి పోయింది. కాలనీవాసులు తాగునీటి సమస్య తీర్చాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపుకు విన్నవించారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శనివారం బోరుబావికి అదనంగా పైప్ వేయించి మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీవాసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా రోడ్డు..



తానూరు: తానూరు–ధర్మాబాద్ వెళ్లే మార్గంలో మండలకేంద్రం శివారులో డబుల్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 96663 31486